క్లుప్తంగా

హరికృష్ణ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

కోడూరు: కాంగ్రెస్ సీనియర్ నేత దివంగత బడే అర్జునరావు కుమారుడు హరికృష్ణ ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వారి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. హరికృష్ణ మృతికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు పాల్గొన్నారు.

పాత్రికేయ విలువల రక్షణ అందరి బాధ్యత

అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు

నాగాయలంక: పాత్రికేయ రంగం విశిష్టత, విలువల పరిరక్షణ బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంకలో పర్యటించిన ఆయన గురువారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జర్నలిస్టులు, మీడియా వారధి లాంటివని చెప్పారు. నియోజకవర్గ పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ రంగంలో ఉన్నత విలువలు పాటించడంలో పాత్రికేయులు సమన్వయం, సహనంతో వ్యవహరించాల్సి ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లుగా సంపూర్ణ సహకారం అందిస్తున్న పత్రికా సంస్థలకు, జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.

60 మంది మహిళలకు చీరల పంపిణీ

నాగాయలంక: సామాజికవేత్త చింతపల్లి దాసు ఆధ్వర్యంలో మండలంలోని మర్రిపాలెం, నంగేగడ్డ ఎస్టీ కాలనీవాసులు, స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు 60 మందికి చీరలను ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్ విద్యుత్ శాఖ డీఈఈ బొజ్జగాని శ్రీనివాసరావు ఆర్థిక సహకారం అందించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రామ్‌కుమార్, ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పెడన విద్యార్థి ఎంపిక

పెడన: తోటమూల జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి బొడ్డు పండు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన రగ్బీ అండర్-17 పోటీల్లో విశేష ప్రతిభ చూపిన పండును రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 20 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థి పండును, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి.నరసింహారావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు బంటుమిల్లిలో 'జగనన్నకు చెబుదాం'

బంటుమిల్లి: జగనన్నకు చెబుతాం కార్యక్రమం శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతుందని తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సహకార వ్యవస్థ వెన్నెముక

మాజేరు(చల్లపల్లి): గ్రామీణ వ్యవసాయ రంగానికి సహకార వ్యవస్థ వెన్నెముకలా పని చేస్తోందని రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కె.భోజ రంగరాజు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సహకార వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు సహకార విలువలు- సూత్రాలు అంశంపై వ్యాస రచన, సహకార సంస్థలతో ఉపయోగాలు అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు సొసైటీ చైర్మన్ అరజా శివశంకర్, సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి బహుమతులు అందజేశారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కోడూరు: కోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశంలో పాల్గొని సమస్యలను నేరుగా తెలపాలని ఎంపీడీఓ కోరారు.

మాలధారులకు సమారాధన

బంటుమిల్లి: స్థానిక అయ్యప్ప స్వామి గుడి వద్ద గురువారం నుంచి ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పలకు అన్న సమారాధన (సద్ది) శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం 54 రోజులపాటు కొనసాగుతుందని సభ్యులు తెలిపారు. అయ్యప్పలు, భవానీలు, శివ దీక్షాపరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి సభ్యులు కోరారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- నంగేగడ్డలో ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

నంగేగడ్డ(నాగాయలంక): సకల జనులకు సంక్షేమ పాలన అందించడంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని నంగేగడ్డ సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిచిన్నారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడుతూ నిత్యం ప్రజల మదిలో నిలిచిపోయేలా జగనన్న పాలన ఉందని చెప్పారు. తొలుత సర్పంచ్ లంకమ్మ, వైస్ ఎంపీపీ చాట్రగడ్డ బాబూరావు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, సర్పంచ్ తోట లంకమ్మ, తోట కృష్ణ, చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, తోట సాయిబాబు, ముమ్మారెడ్డి చంటి, ఆకుల బాబీకుమార్, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నంగేగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

జగన్‌కే ప్రజల మద్దతు..

మెరకనపల్లి(మోపిదేవి): జగనన్న మరోసారి ముఖ్యమంత్రిగా వస్తేనే పేదల జీవనం మెరుగుపడుతుందని నోడల్ అధికారి, ఎంఈఓ విద్యాసాగర్ అన్నారు. కొక్కిలిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. తొలుత డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. ఇంకా గ్రామంలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ర్యాలీగా వెళ్లి దళితవాడ వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ ఎగురవేశారు. గ్రామంలో ఇంటింటా తిరిగి బుక్‌లెట్ అందించి గత ప్రభుత్వం, జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు-అమలును ప్రజలకు వివరించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. రాత్రికి మండల పార్టీ నాయకులు గ్రామంలో బస చేశారు. మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు రెడ్రౌతు వెంకట రమణ, ఆదిరాంబాబు, రావి రాం ప్రసాద్, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంతోషం ..

చల్లపల్లి: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. గురువారం సాయంత్రం చల్లపల్లి గ్రామ సచివాలయం-3 పరిధిలోని ఎస్టీ కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో సంక్షేమ పథకాల బోర్డు, గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేయని మేనిఫెస్టో గురించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు ఫణి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, నాయకులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం..

బంటుమిల్లి: రాష్ట్రంలో నాలుగురేళ్లుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పేదల ప్రభుత్వం కొనసాగుతోందని ఎంపీపీ వెలివెల చినబాబు అన్నారు. బంటుమిల్లి-1 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. బంటుమిల్లి -1 సచివాలయం పరిధిలో సుమారు రూ. 26 కోట్లు వెచ్చించామని అధికారులు నివేదికలు ఇచ్చారు. వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు.



కొక్కిలిగడ్డలో ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్న నాయకులు

పల్లెపాలెంలో..

కృత్తివెన్ను: పల్లెకుపోదాం కార్యక్రమాన్ని గురువారం పల్లెపాలెం గ్రామంలో నిర్వహించారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును, ప్రజా శ్రేయస్సుకు ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న చర్యలను వైఎస్సార్ సీపీ నాయకులు వివరించారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, జేసీఎస్ కన్వీనర్ కె. బాపూజీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, పీఏసీఎస్ చైర్మన్ నరసింహస్వామి, సర్పంచ్ కొల్లాటి రాజు, ఎంపీటీసీ కొల్లాటి కృష్ణ, జాన్‌రత్నం, నాయకులు పాల్గొన్నారు.



బందరులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, కిట్టు

దళారీ వ్యవస్థ ఉండదు..

పెడన: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమ ఫలాలు ఎటువంటి దళారుల పాలు కాకుండా నేరుగా అర్హులకు అందుతాయని, అందుకే జగనన్నే ఆంధ్రకు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. గురువారం కాపులవీధిలోని నాలుగో వార్డు సచివాలయంలో నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, తిప్పా లక్ష్మీనరసమ్మ, నాయకులు వీర్నాల మాధవరావు, వన్నెంరెడ్డి మహంకాళరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్ పాల్గొన్నారు.

జింజేరులో...

జింజేరు గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో కలిసి పార్టీ నాయకులు సైన్ బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గడప గడపకు తిరిగారు. సచివాలయాల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, నాయకులు పామర్తి సాంబశివరావు, వేముల సత్యనారాయణ, చిత్తజల్లు నరసింహారావు, తాతా ఉమామహేశ్వరరావు, గృహ సారథులు పాల్గొన్నారు.

కోడూరులో..

కోడూరు: కోడూరు-1 సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో 10,389మంది లబ్ధిదారులు ప్రత్యక్షంగా రూ.36.28కోట్లు, 3,037మంది లబ్ధిదారులు పరోక్షంగా రూ.10.61కోట్ల నిధులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారని ఎంపీడీఓ శ్రీనివాసరావు వివరించారు. మొత్తం 13426 మంది లబ్ధిదారులకు రూ.42.90కోట్ల నగదును జమ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు రూ.4.69కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం గూడూరు మండలం మల్లవోలు-2 గ్రామ సచివాలయంలో నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు సంగా మధుసూదనరావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, సర్పంచి బొర్రా సాంబయ్య, ఎంపీటీసీ పిట్ల రామిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, నాయకులు పాల్గొన్నారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.



వేకనూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



పల్లెపాలెం సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ



పెడనలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు



కోడూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగన్‌తోనే పేదల అభ్యున్నతి..

వేకనూరు(అవనిగడ్డ): చంద్రబాబు సంపన్నుల కోసం పనిచేయగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వేకనూరులో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ బోర్డును ఎమ్మెల్యే సింహాద్రి ఆవిష్కరించి మాట్లాడారు. వేకనూరు సచివాలయం పరిధిలో రూ.45.21 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తులను నమ్ముకుంటే, జగన్ ప్రజలను నమ్ముకున్నారని చెప్పారు. జగన్ గెలుపు పేదల గెలుపని, మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అధికారం ఇస్తే పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయ సేకరణ చేశారు. ఎంపీపీ సుమతీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న సీఎం జగన్..

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేద ప్రజలను అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 2, 4 డివిజన్లలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలోని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల అమలు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పించారని చెప్పారు. జగనన్న లేఅవుట్లలో మెరకతోలి విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు పలు మౌలిక వసతులను కల్పించారన్నారు. తొలుత పార్టీ జెండాను, ఆయా డివిజన్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన వివరాల బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, షేక్ సలార్‌దాదా, గూడవల్లి నాగరాజు, డెప్యూటీ మేయర్ శీలం భారతి, రెండో డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్, వైఎస్సార్ సీపీ 4వ డివిజన్ ఇన్‌చార్జి వడ్డి రాఘవ, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రక్తహీనత తగ్గింపునకు చర్యలు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని గర్భిణులు, కిషోర బాలికల్లో రక్తహీనతను గణనీయంగా తగ్గించగలిగామని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, జగనన్నకు చెబుదాం, నాడు -నేడు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు జిల్లా ప్రగతిని సీఎస్‌కు వివరించారు. జిల్లాలో గర్భిణుల్లో ఇంతకు ముందు 25 శాతం ఉన్న రక్తహీనతను 15 శాతానికి, 10 నుంచి 15 ఏళ్ల వయసు గల కిషోర బాలికల్లో 79 నుంచి 45 శాతానికి తగ్గించగలిగామన్నారు. మరింత తగ్గించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

జిల్లాలో 394 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించామని తెలిపారు. నాడు -నేడు పథకం ద్వారా జిల్లాలో 238 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

జిల్లా ఇప్పటి వరకు ఎనిమిది మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి 370 అర్జీలు స్వీకరించి 243 అర్జీలు పరిష్కరించామని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జి. గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, డీఈఓ తాహెరాసుల్తానా పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు, బాలికలకు రక్షణ

నాగాయలంక: ఆపదలో ఉన్న మహిళలు, చిన్నారులకు దిశ యాప్ ద్వారా రక్షణ కల్పించవచ్చని నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దిశ యాప్ డౌన్‌లోడ్‌పై గురువారం మెగా డ్రైవ్ నిర్వహించారు. పలు కూడళ్లలో మహిళలకు దిశ యాప్ వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని 800 మంది మహిళల మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో తక్షణ సాయం..

పెడన: దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో వినియోగిస్తే పోలీస్ శాఖ నుంచి తక్షణ సహాయం అందుతుందని పెడన సీఐ షేక్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడమే కాదని, దాని గురించి మరికొందరికి తెలియజేయాలన్నారు. దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్, కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దోసపాటి బాబా, కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

దశదిశల రక్షణ..

కోనేరుసెంటర్: దిశ యాప్ మహిళలకు దశ దిశల రక్షణ కల్పిస్తుందని జిల్లా ఎస్పీ పి. జాషువా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుకోవాలని చెప్పారు. ఫోన్లలో దిశ యాప్ ఉంటే పోలీసులు రక్షణ కవచంలా మీ వెంట ఉన్నట్లేనన్నారు. ఈ యాప్‌ను మహిళలే కాకుండా పురుషులు కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద, అత్యవసర సమయాల్లో కేవలం 5 నిమిషాల్లో పోలీస్ సిబ్బంది మీ వద్దకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు.



నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి

మోపిదేవి: నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. గురువారం చల్లపల్లి సీఐ నాగప్రసాద్‌తో కలిసి నాగపుట్ట, క్యూలైన్, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. చక్రధరరావు మాట్లాడుతూ శుక్రవారం నాగుల చవితి సందర్భంగా తెల్లవారుజాము 2.30 గంటలకు నాగపుట్ట వద్ద వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పుట్ట పూజలు, పంచామృత అభిషేకం నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటలకు స్వామి వారికి బాల భోగ నివేదన అనంతరం స్వామివారి దర్శనం ఉంటాయన్నారు. సాయంత్రం మహా నివేదన, పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని వివరించారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారన్నారు. దేవస్థానానికి వచ్చే భక్తులు వారి వాహనాలను పోలీసువారు సూచించిన పార్కింగ్ ప్రదేశంలోనే నిలపాలని చెప్పారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు, సీఐ నాగప్రసాద్

స్వామివారికి వెండి నాగపడగ సమర్పణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి రావివారిపాలెంకు చెందిన భక్తులు పిరికెటి రాంబాబు కుటుంబ సభ్యులు వెండితో తయారు చేసిన నాగపడగను సమర్పించారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారి కిషోర్‌కు వెండి పడగను అందజేశారు. 514 గ్రాముల వెండితో తయారు చేసిన సుమారు రూ. 44,800 విలువగల వెండిపడగను అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

- **చల్లపల్లి:** విద్యార్థి దశలో క్విజ్ పోటీల ద్వారా ప్రతిభకు పదును పెట్టవచ్చని లైబ్రేరియన్ కె.గణేష్ కుమార్ అన్నారు. గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

వైఎస్సార్ టీఎఫ్ పెడన శాఖ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

పెడన: వైఎస్సార్ టీఎఫ్ పెడన మండల శాఖ అధ్యక్షుడిగా కొలుకుల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా కాట్రగడ్డ హనుమంతరావును నియమించినట్లు వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన వంటి కార్యక్రమాలు విద్యా వ్యవస్థకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని నూతనంగా బాధ్యతలను చేపట్టిన పెడన శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

జంగాల భవన యజమానులకు నోటీసులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జంగాల భవన యజమానులకు మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య నోటీసులు జారీ చేశారు. భవనంలో 3వ అంతస్తు అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు సెల్లార్ లేకపోవడంపై జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ఆదేశాల మేరకు కమిషనర్ ఈ చర్య తీసుకున్నారు. జంగాల భవన యజమానులు భవనాన్ని అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడంతో నోటీసులు జారీ చేశారు. దీంతో ఈ కాంప్లెక్స్‌లో ఉన్న ఎంబీఆర్ షాపింగ్‌మాల్, జంగాల జ్యూవెలరీ దుకాణాలను గురువారం మూసివేశారు. ఇటీవల జేసీ అపరాజితసింగ్ వస్త్రాల కొనుగోలుకు వెళ్లారు. బిల్డింగ్‌లో పార్కింగ్ సెల్లార్ లేకపోవడం,మూడో అంతస్తు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం తదితర అంశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు.

వ్యాస రచన పోటీలకు స్పందన

మచిలీపట్నంటౌన్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. గ్రంథాలయాలు - ఉపయోగాలు అంశంపై జూనియర్స్, గ్రంథాలయ ఉద్యమం అనే అంశంపై సీనియర్లకు వ్యాసరచన పోటీలు జరిగాయి. 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేయనున్నారు. సాయంత్రం భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ దాసరి ఆళ్వార్‌స్వామి రచించిన పత్రికా రంగంలో నా అనుభవాలు గ్రంథాన్ని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. సాహిత్య పరిషత్ ప్రతినిధులు శాస్త్రి, రాజేంద్రప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, పలువురు కవులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణచంద్రరావు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు ప్రారంభం

కోనేరుసెంటర్: బందరు మండలం కరగ్రహారం జగనన్న కాలనీ ఏ బ్లాక్‌లో నూతనంగా సమకూర్చిన విద్యుత్ లైన్లను గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నామని చెప్పారు. నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఏ బ్లాక్ లో 1700 గడపకు విద్యుత్ మీటర్ కనెక్షన్లు అందజేస్తామని తెలిపారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి, విద్యుత్ ఈ ఈ భాస్కరరావు, డి. శ్రీనివాసరావు ఏఈ నాగేశ్వరరావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

అయ్యప్ప క్షేత్రానికి విరాళం

చల్లపల్లి: గ్రామంలోని నిమ్మలతోటలో ఉన్న హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రం అభివృద్ధికి భక్తులు విరాళం అందించారు. గ్రామానికి చెందిన అడపా రమ్యశ్రీ లక్ష్మి, ఆమె తల్లిదండ్రులు అడపా రామారావు (రాంబాబు)- నాగశారద, అడపా గురవయ్య దంపతులు రూ.50,116 విరాళాన్ని గురువారం ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావుకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు.